# కళ్యాణి కధ



రంగనాయకమ్మ

# కళ్యాణి కథ

(నవల)

పేజీలు : **328**
**[** రాయల్ సైజులో **]**

**ధర : 100 రూ.లు**

రచనా కాలం:
2019 జనవరి నించీ, ఆగస్టు వరకూ

సీరియల్ గా,
'స్వాతి' వార పత్రిక లో,
13-9-2019 నించీ, 1-1-2021 వరకూ,
47 వారాలు వచ్చింది. 'కరోనా' కాలం లో,
కొన్ని వారాలు పత్రిక రాలేదు.

పుస్తకంగా:
మొదటి ముద్రణ: 2021 జనవరి

కంపోజింగ్, పేజీ మేకప్:
శారద, లలిత,
జె.యు.బి.వి. ప్రసాద్
బి.ఆర్. బాపూజీ

ముద్రణ:
**చరితా ఇంప్రెషన్స్**
1-19-1126/బి, ఆజామాబాదు ఇండస్ట్రియల్ ఏరియా,
హైదరాబాదు - 500 020

ప్రతులకు:
**అరుణా పబ్లిషింగ్ హౌస్**
ఏలూరు రోడ్డు,
విజయవాడ - 520 002
(ఫోన్: 9440630378)

రంగనాయకమ్మ అడ్రసు:
76, లేక్-సైడ్ కాలనీ
అమర్ సొసైటీ
జూబ్లీ హిల్స్ పోస్టు
హైదరాబాదు - 500 033

# కళ్యాణి కధ!

కళ్యాణి, ఆ రాత్రి గంటకు పైగా తలెత్త కుండా నోట్సు రాసుకుంటూనే వుంది. ఎప్పుడో తలెత్తి గోడ గడియారం వేపు చూస్తే, 10 దాటిపోయి సెకండ్ల ముల్లు పరుగు తీస్తోంది.

అది 'రాత్రి' అని, అప్పటికి గుర్తొచ్చింది, ఆ విద్యార్థినికి. నాన్న, బైటి అరుగు మీద, మడత మంచం మీద నిద్ర! అమ్మ, లోపల వంట వసారాలో, నులక మంచం మీద! అక్క, తూర్పు గదిలో, ఇంకా రేడియోలో సినిమా పాటలు వింటున్నట్టే వుంది. ఆ పాటల గోలతో చావిట్లో కూర్చుని రాసుకోడం ఎంత యాతనో! అయినా, అక్కడ గాక ఇంకో దారి లేదు.

"రేడియో అంత గట్టిగా పెట్టొద్దే అక్కా" అంటే, అది చచ్చినా వినదు. ఇంకా ఎక్కువ చేస్తుంది కూడా. లేకపోతే, రయ్యిన తలుపులు తెరుచుకుని వచ్చి పడి, "నీకు చదువా? ఉద్యోగం మిడుకుతావా? నేనైతే పాటలు వినకూడదా?" అంటూ అంత రాత్రి కూడా పెద్ద పెద్ద కేకల్తో, తన వాలు జడ చివర వేళ్ళాడే జడ గంటలతో బాదుతానని జడని ఊపుతూ వెనక్కి తిరుగుతుంది. రోజూ రాత్రి గోలే అది.

ఎప్పుడన్నా, అరుగు మీద నిద్రపోయే తండ్రి చప్పున విసుగెత్తి, "అమ్మాయ్ బంగారీ! ఏంటా పాటలు? ఏంటా గోల? నీ గది కిటికీ లోంచి చూడు, బైటికి ఎలా వినపడిపోతందో! కొంచెం తగ్గించు! పగలంతా వింటూనే వింటావుగా? అర్ధరాత్రి కూడా నిద్ర రాదా?" అంటూ నాలుగు కేకలు మెత్త మెత్తగా వేస్తే, ఆ బంగారి కూడా అదే చేస్తుంది. "ఆఁ, తగ్గిస్తాలే. ఈ పాటలు పగలు రావు" అంటూ. కూతురు కూడా ఎదురు కేక లేస్తోంటే, తండ్రి గారు నోరెత్తకుండా మౌనం దాలుస్తాడు.

ఆ ఇంట్లో వాళ్ళూ, ఇరుగు పొరుగుల వాళ్ళూ, ఆ బంగారిని, "బంగారీ, బంగారీ" అంటారు గానీ, ఆ బంగారికి మేనమామ పెట్టిన అసలు పేరు 'లావణ్య!' ఆ పేరుతో దాన్ని ఎవరూ పిలవరు గానీ, ఆ పేరు అయితే అందరికీ తెలుసు. ఒక్కో సారైతే సరదాగా, 'వణ్యా, వణ్యా" అంటారు. ఆ వణ్యా, ఖయ్యిమంటూ, "నా పేరు వణ్య కాదు, లావణ్య! మీకు తెలవదా?" అంటుంది. "బంగారీ! బంగారం!" అని పిలిస్తే మాత్రం "ఎందుకూ?" అని నవ్వుతూ ఎదురొస్తుంది.

ఈ రాత్రి, ఆ తండ్రి, నిన్న రాత్రి వేసిన రెండు కేకలైనా వెయ్యకుండా, తను కూడా ఆ పాటలు వింటున్నాడో లేదో గానీ, నోరైతే ఎత్తలేదు.

వంటింటి వసారాలో, నులక మంచం మీద నిద్రపోయే తల్లికి, పెద్ద పిల్ల పాటలు గానీ, చిన్న పిల్ల చదువులు గానీ, ఏవీ పట్టవు. రాత్రి పూట తిళ్ళు అయ్యీ అవగానే, తన దారిన తను, ఆ మంచం ఎక్కుతుంది.

ఎటొచ్చీ, అర్ధరాత్రి దాకా ఆ రేడియో పాటల ఇబ్బంది అంతా కళ్యాణికే. అక్క గారి సినిమా పాటల పిచ్చిని మించి, ఈ చెల్లెలికి చదువు పిచ్చి! డిగ్రీ పరీక్షలు ముగియక ముందు నించే, బ్యాంకు పరీక్షల కోసం తాపత్రయం! తను తప్పకుండా ఉద్యోగం చేసుకోవాలి. ఈ ఇంట్లోంచి పారిపోవాలి. నెలకి ఐదో, పదో మాత్రమే వచ్చినా, తన ఉద్యోగంతో తను బతకగలనని ఏమిటో ఒకటే నమ్మకం, ఈ పిల్లకి. అర్ధరాత్రి దాకా చదువు సాగకపోతే, నిద్రే పట్టదు దీనికి.

ఆ రాత్రి, పది గంటల ముందే, చావిట్లో, తన మంచం మీదే నిద్రకి పడింది గానీ, పావు గంట లోపలే ఉలిక్కిపడి లేచింది. అక్క గారు, ఆ రేడియో తెచ్చి మొహం మీద పెట్టి, "ఒసే, ఈ పాట విను, ఎంత బాగుందో! అప్పుడే నిద్రేంటే గాడిద లాగ?" అని అరుస్తోంటేనే ఆ ఉలికిపాటుతో లేచింది. లేచీ లేవగానే, పక్కలోనే తెరుచుకుని పడివున్న పుస్తకం కోసం వెతుక్కుంది. "అక్కా! లేపేశావు, మంచి దానివి,

మంచిదానివి" అంటూ పుస్తకం పట్టుకుంటోంటే, చెల్లెలి చేతుల్లోంచి దాన్ని లాగేసింది అక్క! "చదువు! చదువు! పాపం నీ చదువు మోజే నీకు! నా పెళ్ళి మాట నాన్నతో చెప్పమంటే వింటున్నావా? నాకు ముసలాడితో పెళ్ళి చేస్తారా? డిగ్రీ చదివేదానివి, నాన్నకి గడ్డి పెట్టలేవూ?" అంటూ అక్క అరుస్తోంటే, చెల్లెలికి అప్పటికి పూర్తిగా కళ్ళు తెరుచుకున్నాయి. కొంచెం నవ్వింది. "అన్యాయం అక్కా! బావ, ముసిలాడా? అలా అంటావెందుకు? బావకి నువ్వంటే ఎంతో ఇష్టం అంట! నిన్న అత్తయ్య..."

"నోరు ముయ్యి! అత్తా, గిత్తా! నా కన్నా పదేళ్ళు పెద్ద వాడు, తెలుసా? అసలు ఇంకా పెద్దవాడేమో! అత్త నిజం చెపుతుందా?"

"అదేంటక్కా? పెద్ద బావ ఎప్పుడు పుట్టాడో అమ్మా వాళ్ళకి తెలవదా? నీ కన్నా పదేళ్ళు పెద్దంటే;... ... ఏమోలే. బావతో పెళ్ళి వొద్దని నువ్వే చెప్పేస్తున్నావుగా? నాన్నతో నువ్వే మళ్ళీ చెప్పు!"

"చెప్తే వింటున్నాడా నాన్న? ఇంకో సంబంధం అయితే కట్నం ఇవ్వాలంట! డబ్బు లేదంట! అత్త, కట్నం వొద్దంటందిగా? అయితే మాత్రం? నన్ను ముసిలాడికిచ్చి చేస్తారా? నువ్వు చేసుకో వాణ్ణి!"

అక్క చేతుల్లో పుస్తకం నలిగిపోతోంటే, చెల్లెలికి గుండె ఆగినంత పనైంది. "అక్కా! అక్కా! అది నా నోట్ బుక్కు.." అంటూ దాన్ని లాగేసుకోబోతే, అక్క, దాన్ని తను వచ్చిన గది గుమ్మంలోకి గిరాటు కొట్టింది.

"అక్కా, అక్కా! అది నోట్సు! పేజీలు చిరిగి పోతాయి. నాకు వారం రోజుల్లో వున్నాయి పరీక్షలు. మొన్న కూడా నా పుస్తకం తీసి దాచేశావు. దాన్ని రాధ దగ్గిర్నించి తెచ్చుకున్నాను. ఇది నోట్సు అక్కా! మళ్ళీ రాసుకోలేను. టైమే లేదు" అంటూ చెల్లెలు మంచం మీద నించి దూకి అటు పరిగెత్తి, ఆ పుస్తకం పట్టుకోబోయింది గానీ, అక్క గారు చెల్లెల్ని తోసేసి, అంతకన్నా ముందు తనే పరిగెత్తి, తన గది గుమ్మం లోపలికి గెంతి, ఆ నోట్ బుక్‌ని కాలితో గది లోపలికి తన్నేసి, తలుపులు మూసేసింది.

"అక్కా, అక్కా! ఆ పుస్తకం చింపకు! అప్పుడొకసారి రెండు కాయితాలు చింపేశావు. అక్కా! నా మీద వొట్టు! నన్ను చంపుకు తిన్నంత వొట్టు! అక్కా! నీ పాదాలు పట్టుకుంటాను. అక్కా..."

"నీకు వొట్లే ఇష్టం లేదుగా?" లోపలి నించి అరుపు!

"నీకు బాగా ఇష్టం కదా అక్కా! నా పుస్తకం నా కిచ్చెయ్యి! ఇంకా రాసుకోవాలి అక్కా! బంగారు అక్కా!"

"రేపిస్తాలే, అంత ఏడవకు!"

"అమ్మో! రేపా? ఇప్పుడే ఇంకా రాసు కోవాలక్కా!"

"నాన్నకి గడ్డి పెడతావా, ఆ ముసిలాడితో నాకు వొద్దనీ?"

"బావతో నువ్వు పేకాటాడతావు కదా అక్కా? పాపం, బావ నిన్నే ఇష్టపడుతున్నాడంట!"

"ఏడిశాళ్ళే! ముసిలి వెధవ!"

"అవ్వ! ముప్ఫై యేళ్ళకే ముసిలాడా అక్కా? పోనీ అమ్మకి చెపుతాలే. నీకు ఇష్టం లేదని ఇప్పుడే చెపుతా!"

"అయితే, చెప్పిరా! అప్పుడిస్తాలే నీ గొప్ప నోట్సు! లేకపోతే చూడు, ముక్క ముక్కలు చేసి పడేస్తా."

"అక్కా, అలా చెయ్యకు. ఇప్పుడే చెప్తా అమ్మతో! పాపం, అమ్మ నిద్ర పోతోందేమో! వెళ్తున్నా, వెళ్తున్నా అక్కా!" అంటూ కళ్యాణి, వంటింటి వసారాలోకి పరిగెత్తింది.

తల్లి, దుప్పటి కప్పుకోకుండా ముడుచుకుని కుప్ప లాగ పడి నిద్రపోతోంది. కళ్యాణి, చప్పున అమ్మకి పక్కనే వున్న దుప్పటి తీసి నిండా కప్పింది.

అమ్మని ఎలా లేపాలి? పాపం, పగలంతా పనే! అక్క కోసం, దానికి నచ్చే కూర మళ్ళీ చేస్తేగానీ, అది తినదు. మళ్ళీ మళ్ళీ చెయ్యకుండా అమ్మ వూరుకోదు. విసుక్కోదు, సణుక్కోదు; 'దానికి నచ్చకపోతే ఎలా తింటుందిలే' అంటూనే మళ్ళీ అదో గారం!

"అమ్మా.. అమ్మా..." అంటూ కళ్యాణి జంకుతూ అమ్మ కాళ్ళ మీద చెయ్యి పెట్టి సవరదీస్తూ, ఇంకా నెమ్మదిగా, "అమ్మా... అక్క నా నోట్‌బుక్కు తీసుకు పోయిందమ్మా! చింపేస్తా నంటోంది. అమ్మా! అందులో చాలా రాసు కున్నాను... అక్కేమో గదిలో..."

"ఆఁ.. ఆఁ.. ఏంటీ?" అంటూ కంగారుగా

లేచింది అమ్మ.

"అక్క, నా పుస్తకం లాగేసి తీసుకు పోయిం దమ్మా! తప్పకుండా చింపేస్తుంది. నువ్వు రామ్మా! నే నడిగితే అది వింటం లేదు."

"పుస్తకమా? దానికేనా గోల? అదే ఇస్తుందిలే, పడుకో!" అంటూ లేచిన అమ్మ వెనక్కి వాలి, దుప్పటి పైకి లాక్కుంది.

"అమ్మా! కాదూ... అది ఇవ్వదు, చింపేస్తుంది. మొన్న అలాగే చింపేసిందిగా? దానికి పెద్ద బావతో పెళ్ళి ఇష్టం లేదంట! బావ ముసిలోడంట! దానికి ఇష్టం లేకపోతే ఎందుకమ్మా? నువ్వొచ్చి నాన్నకి చెప్పు! లేమ్మా! ఒక్కసారి లే" అంటూ కళ్యాణి, అమ్మ మీద దుప్పటి లాగేసింది.

అమ్మ బాగానే తేరుకుంది. "అది ఇంకా ఆ పాటేనా? ముప్పైయ్యేళ్ళ పిల్లోడు ముసిలోడా? అవ్వ! పాతికేళ్ళ వాడిలా వుంటాడు. నిన్న నాన్న దానికి బాగానే చెప్పాడుగా?"

"కావాలంటే, అక్కే మళ్ళీ నాన్నతో చెప్పుకోవాలి గానీ, నాన్నతో నన్ను చెప్పమంటుందేంటీ?"

అమ్మకి, పెద్ద కూతురు మీద ఎప్పుడూ రాని కోపమే వచ్చింది. "దానికి పెళ్ళి రాతే లేదేమో! అత్తయ్య, కట్నాలే వొద్దందిగా? ఆవిడైతే కోడల్ని నెత్తి మీద పెట్టుకుంటుంది."

"అమ్మా! నా నోట్సు వుందమ్మా అక్క దగ్గిరా."

"ఇస్తుందిలేవే. ఎందుకివ్వదూ? నీ గోల నీదీ!"

"ఏమో, చింపేసినా, చింపేస్తుంది. అప్పుడు చింపేసిందిగా? నువ్వొచ్చి అడుగమ్మా! ఒక్కసారి రా! మళ్ళీ పడుకుందువు గాని... మళ్ళీ దుప్పటి కప్పుతా."

అమ్మ లేచింది నీరసంగా. పక్క గది దగ్గిరికి నడిచింది. అమ్మ చెయ్యి పట్టుకుని కళ్యాణే అమ్మని నడిపించింది. అమ్మకి అప్పుడే కొంచెం మోకాళ్ళ నొప్పులు!

ఆ గది తలుపులు మూసేసి వున్నాయి. అమ్మ, తలుపుల్ని గెంటింది గానీ, లోపల గడి పెట్టేసినట్టే వుంది.

"అమ్మా, పెద్దా! బంగారీ! ఏంటీ నువ్వూ? నాన్నకి చెప్పావుగా? రేపు అత్తకి చెప్పేద్దాంలే. చిన్నా పుస్తకం ఇచ్చెయ్యమ్మా! అది చదువుకోవాలని ఏడుస్తోంది. దాన్ని చింపకు సుమా! తప్పు!"

"తప్పకుండా చింపేస్తా! ఏడుస్తూ కూర్చోమను దాన్ని! దాన్ని చేసుకోమను, ఆ ముసిలోణ్ణి!"

"పిచ్చి ముండా! ఆ కుర్రోడికి ముప్పై యేళ్ళే. ముద్దుగా వుంటాడు."

"అయితే, నువ్వు చేసుకో వాణ్ణి!"

"ఛీ! పిచ్చి వాగుడు! కళ్ళు పోతాయి."

"ఎవరి కళ్ళు? నా పెళ్ళి ముసిలోడితో చేస్తే, మీ కళ్ళే పోతాయి, తెలుసా?"

"వొద్దు లేమ్మా! ఎవళ్ళవి పోయినా అందరం ఏడుస్తాం. వొద్దులే, ఎవళ్ళవీ పోవొద్దు!"

"మీ కళ్ళు తప్పకుండా పోతాయి. మీ కళ్ళు పోతే నేనేం ఏడవను, నవ్వుతా! నవ్వుతా!"

"అవ్వ! నీ మాటలకేం గానీ, ముందా పుస్తకం బైట పడెయ్యి! చిన్నా ఇక్కడే వుంది."

"ఉండమను! రేపొద్దున్న దాకా గడప దగ్గిరే ఏడుస్తూ కూర్చోమను!"

"నువ్వా పుస్తకం చింపకు సుమా!"

"ఏమో! చింపితే చింపుతా! చింపి తీరుతా!"

"తప్పమ్మా! రేపొద్దున్న ఇస్తావా పోనీ?"

"రేపొద్దున్నే అత్తకి చెప్పేస్తారా?"

"అత్త మాట కాదు. ఆ కుర్రాడికే నువ్వంటే ఇష్టం అంటగా?"

"ఏడిశాళ్ళే! ముసిలి వెధవ!"

"అబ్బా! ఏం మాటలే! నీ ఇష్టం అమ్మా! ఆ పుస్తకం మాత్రం బైట పడెయ్యి తల్లీ!" - అమ్మ మాటలు మెత్త మెత్తగా.

"పడెయ్యను! పడెయ్యను! పడేస్తే నూతిలో పడేస్తా!"

"అక్కా! అక్కా! నీ కాళ్ళకి పసుపు రాసి దణ్ణం పెడతాను!" - కళ్యాణి ఏడుపు కంఠంతో ప్రార్థించింది.

జవాబు లేదు! రేడియో కూడా ఆగింది.

తల్లి, చిన్నాకి సైగ చేసింది, "ఫర్వాలేదు, అదే ఇస్తుంది. నువ్వెళ్ళి పడుకో!" అన్నట్టు.

"అమ్మా! దానికి ఇష్టం లేని పెళ్ళెందుకు చెప్పు? న్యాయమేనా?"

"సరేలే, రేపు అత్తతో చెప్పేస్తాలే."

తగువు ఆగింది అప్పటికి.

కళ్యాణి తన పక్క మీద వాలి దుప్పటి కప్పేసుకుని కళ్ళు తుడుచుకుంటూనే గడిపింది.

* * *

**తెల్లారినప్పట్నించీ** తండ్రితో పెద్ద కూతురికి గట్టి పంచాయితీయే జరుగుతోంది. ఆ తండ్రి, ఆ కూతురితో, ఆ బంగారి పుట్టిన తర్వాత అంత కచ్చితంగా, అంత తేల్చేస్తూ ఎప్పుడూ మాట్లాడి ఎరగడు. ఆ తెల్లారాకే అంత గట్టిగా చెప్పాడు. "రాత్రి అంతా తెలిసిందిలే. అతనికి ముప్పై ఒకటో యేడు నిన్నో మొన్నో మొదలైంది. అలాంటి వాడే ముసిలాడైతే, నాకు డెబ్భై దాటాయి. నే నెవణ్ణి అవ్వాలి? మీ అమ్మ కన్నా నేను ఎనిమిదేళ్ళు పెద్ద. నీ కంత నచ్చకపోతే అత్తయ్యని పిల్చి చెప్పేద్దాం. నేను ఇంకో సంబంధం మాత్రం వెతకలేను సుమా! అన్నీ నీకు నిన్నే చెప్పాను. మన చేతిలో ఏం వుంది? నే నేవన్నా వేల వేల రూపాయల జీతగాణ్ణా? ఇంక నీకు 'పెళ్ళి' వుండదులే. అమ్మకి ఎలాగా పెద్ద వయసే. కాళ్ళ నెప్పులు. ఇక్కడే వుండి, నువ్వే ఇంటి పని చేసుకో ఇంక."

"చిన్నా చెయ్యదా ఇంటి పని?" అని ఖయ్యి మంది బంగారి.

"అది ఉద్యోగం చేస్తానని, ఆ పరీక్ష లేవో చదువుకుంటూ వుందిగా? ఉద్యోగం ఎక్కడొస్తే అక్కడికి పోతుంది. ఇక్కడ కూర్చుంటుందా? నువ్వు టెన్త్‌తో మానుకున్నావు. పెళ్ళి కూడా మానుకుంటే పుట్టిల్లే నీకు."

తండ్రి మాటల్తో తల్లి అందుకుంది. "ఇంటి పని మాటకేం గానీ, అసలు ఆ కుర్రాడికేం తక్కువ? బోలెడు ఆస్తి వాళ్ళకి! అన్నదమ్ములు పంచుకుంటే అతనికి పాతిక ఎకరాలకు పైనే వొస్తుంది. ఆడ బిడ్డల బెడదే లేదు. వాళ్ళకి పెళ్ళిళ్ళయిపోయి వెళ్ళిపోయారు. దీనికి పెళ్ళయితే, మొగుడూ, అత్తా, అంతే. ఆ కుర్రాడు తనకి వేరే సంబంధమే అక్కర్లేదంటున్నాడంట! నిన్న చెప్పిందిగా మీ అత్తయ్య?" అంటూ తల్లి పెద్ద కూతురి వేపు చూసింది ఆశగా.

"ఎంత సేపూ వాణ్ణి పొగుడుతారు. ఉత్త పిరికి సన్నాసి. సిగరెట్లు కాల్చితే, మొగాళ్ళు ఎంత దర్జాగా వుంటారు! అది నచ్చదంటాడు! పేకాడతాడు గానీ, ఒక్క సారీ గెలవడు. ఉత్త మొద్దు మొహం! అలాంటి వాడితో నాకు పెళ్ళా?"

"అక్కా! పెద్ద బావ నాకు ఒక సారి చెప్పాడు. పేకాటలో నువ్వే నెగ్గాలని తను ఓడిపోతున్నట్టు ఆడతాడంట. అలా చెప్పాడు నిజంగా. అంతేగానీ, బావకి ఆ ఆట ఎందుకు రాదక్కా?" అంది చెల్లెలు.

అక్క రయ్యిన లేచింది. "అంటే, మీకిద్దరికీ గుస గుసలా? అయితే, వాణ్ణి నువ్వే చేసుకో ముండా!" అని అరిచింది.

"నా ముద్దూ ముచ్చటా అక్కర్లేదు మీకు. చెర్లో దూకుతాలెండి. ఎందుకీ గోల?"

తండ్రికి ఎప్పుడూ రాని కోపమే వచ్చినట్ట యింది. "ఇదుగో, నువ్వు చెర్లో దూకొద్దూ, నూతిలో దూకొద్దూ! చెప్పేది వినవేం? నే నింకో సంబంధం వెతకను. వెతికితే, ఏం ఇవ్వగలం వాళ్ళకి? అత్త అయితే, పెళ్ళి ఖర్చులన్నీ తనే పెట్టుకుంటానంది. నీకు వొంటి నిండా నగలు చేయిస్తానంది. అయ్యన్నీ నీకూ తెలుసులే, నిన్న విన్నావుగా? నీ ఉంగరాల కొలతలూ అవీ కావాలంది. కంసాలిని తీసు కొస్తుంది. ఆనక వొస్తుంది, చెప్పెయ్యి! నువ్వు ఏడుస్తూ వుంటే, పెళ్ళి చేస్తామా? నేను మాత్రం వేరే సంబంధం చూడలేను. ఈ మాట వంద సార్లు చెప్పాను."

"నాకు నచ్చేవాడితో పెళ్ళి చెయ్యవా?"

"వాడో లక్ష రూపాయలడుగుతాడు. మన దగ్గిరుందా?"

"చిన్నాకి మంచి వాడితో పెళ్ళి చెయ్యరా?"

"అది ఉద్యోగం కోసం పోతుంది. దాని పెళ్ళి అది చేసుకోవలిసిందే. మా వల్ల ఎలా అవుతుంది?"

"ఆడ పిల్లలు పుడితే, డబ్బు సంపాదించొద్దా?"

"అంత తెలివి లేదుగా నాకు? ఏ నాడో తాతయ్య తండ్రి కట్టించి పోయిన వందా పాతిక గజాల పెంకుటింట్లో బతుకుతున్నాం. ఈ కొంపెప్పుడు కూలుతుందో తెలవదు. కూలిందంటే, అత్త యింటికి పరిగెత్తాల్సిందే. గాలి గట్టిగా కొట్టిందంటే గుండెలు ఆగినట్టే! ఇదుగో! పోనీ ఒక మాట చెపుతా! మీ మేన మామ, వొడ్ల మిల్లులున్న

వాడే. అతనే ఇంకో సంబంధం చూసి, కట్నాలిచ్చి నీ పెళ్ళి చేస్తాడేమో అడుగు! అదీ జరగకపోతే, నువ్వింక ఇక్కడ పడి వుండాల్సిందే!"

తల్లి, వంట వసారాలోకి పోయిందే, మళ్ళీ వచ్చింది. "చిన్నా, అత్తయ్యని ఒక సారి తీసుకురా! చెప్పేస్తే పోతుంది" అంటూ అరిచింది.

చిన్నా కూడా అంతా వింటూనే వుంది, దుప్పటి తియ్యకుండానే. "అమ్మో! నేను కాలేజీకి పోవాలి. టైమై పోతోంది" అని అరిచింది పక్క మీద నించే.

"సరేలేవే, నీ గోల నీది. ఒక సారి అత్తయ్యకి చెప్పేసి వెళ్ళు! ఆవిడ ఇవ్వాళ కంసాలిని తీసుకొస్తానంది. అదేమీ వొద్దని చెప్పకపోతే, వాళ్ళొచ్చి కూర్చుంటారు. అప్పుడేం చెపుతాం? అత్తయ్యతో అక్కడేం చెప్పకు!"

చిన్నా రయ్యిన లేచింది. "అత్తయ్యకేమీ చెప్పను. రమ్మంటానంతే" అంటూ తెల్ల వార్లూ నిద్రపట్టక, తెల్లారి ఆరు దాటినా లేవని చిన్నా, అప్పుడే మంచం దూకింది. కళ్యాణికి ఇంట్లో పేరు చిన్నాయే. అదీ గాక, 'కళా' అని కూడా!

పక్క గదిలోంచి అప్పుడే చిన్నా పుస్తకం చావిట్లో మంచం అడుక్కి వొచ్చి విసురుగా పడింది.

"ఇదుగో, నువ్వేం చెప్పక్కర్లా! నీ దారిన నువ్వు ఫో!" అని అరిచింది అక్క, గది గుమ్మంలో నిలబడి.

తండ్రీ, తల్లీ మెత్తగానే చూశారు. "అంటే, ఏంటీ? ఆవిడికి అసలు మాట చెప్పెయ్యకపోతే ఎలాగ? కంసాల్ని వెంటబెట్టుకు వస్తే, అప్పుడెలాగ చెపుతాం? ఉంగరాలకో, గాజులకో, కొలతలు కావాలంటే ఇస్తావా? ఇవ్వవు, అప్పుడెంత సిగ్గు, కంసాలి ముందు!"

"ఇవ్వకేం చేస్తాను? 'ఇంకో సంబంధమే చూడం' అని మీరు తెగేసి చెప్పేస్తాంటే, ఇవ్వక చస్తానా? నెక్లెస్ కూడా చేయిస్తుందా? మువ్వల వడ్డాణం కూడానా? అత్తయ్య, తాటాకు రకం వడ్డాణమే పెట్టుకుంటుంది. అది కాదు; నాకు మువ్వల వడ్డాణమే కావాలి. మొన్న వడ్డాణాల ఎడ్వర్టయిజ్‌మెంట్ చూస్తే, ఎంత బాగుందో! అలాంటిది లేకపోతే, పెళ్ళా, గిళ్ళా? నాకేం వొద్దు! ఇక్కడే వుంటా లెండి!"

వింటున్న వాళ్ళు ముగ్గురూ మూర్ఛలు పోయారు.

తల్లే తేరుకుంది. "నీ కేవేం కావాలో నువ్వే అడుగూ! అత్తయ్య పొంగిపోతూ చేయిస్తుంది. ఎప్పుడూ చెపుతూనే వుందిగా? మీ నాన్నంటే ఆవిడికి ప్రాణం. నాన్నకి పదేళ్ళప్పుడే తల్లి పోతే, అప్పణ్ణించీ ఆవిడే తమ్ముణ్ణి పెంచిందంటగా? తమ్ముడి కూతుర్ని కోడలిగా చేసుకుంటేనే, అప్పా తమ్ముళ్ళ సంబంధాలు నిలుస్తాయని ఆవిడికి ముచ్చట...."

"ఆవిడి ముచ్చట కోసం, నా బతుకుని నాశనం చెయ్యండి! సిగరెట్లు కాల్చే ఫేషన్ కూడా తెలవని బండ వాడితో బతకాలి నేను!"

"ఇదేం మాట మళ్ళీ? సిగరెట్లు కాల్చాలో, బీడీలు కాల్చాలో, నువ్వే నేర్పుకో! నువ్వంటే ఇష్టం అయినవాడు నువ్వు చెప్పినట్టే నడవడా, నడుస్తాడు. ఆ కుర్రోడికి లక్షలు గుమ్మరిస్తామని సంబంధాలు వస్తున్నట్టు మనకి తెలవదా?"

"కుర్రోడు! ముప్పైయేళ్ళ వాడు కూడా కుర్రోడే!"

"ఇదుగో, ఇన్ని మాట లెందుకు? నక్లీసులూ, వడ్డాణాలూ కావాలంటే చేసుకో, అక్కర్లేదంటే మానుకో! తన కొడుక్కి ఎంతెంత సంబంధాలొచ్చినా అత్తయ్య ఏం చెపుతా వుంటది? 'మా తమ్ముడి కూతురుంది, 'రంభ లాంటి పిల్ల' అని ఆవిడ ఆ సంబంధాల వాళ్ళని పొమ్మంటుంది కదా? అయ్యన్నీ నీకూ తెలుసు. మన మాట మనం చెప్పేస్తే, ఆవిడ ఏదో ఒక సంబంధం చూసు కుంటుంది."

"అత్తయ్య ఇంకో సంబంధం చూస్తే మాత్రం, కొడుకు చేసుకుంటాడా?"

"ఇది మరీ బాగుంది. నువ్వు కాదంటే, ఇంక పెళ్ళే లేకండా వుండిపోతాడా? ఆస్తిపరుడికి పెళ్ళే కాదా?"

"అప్ప గారికి అంత ఆస్తి వుంటే, నాన్న కెందుకు లేదు?"

"అన్నీ తెలిసే అడుగుతావెందుకు? అత్తయ్యా వాళ్ళ ఆస్తి, ఆవిడి మావ గారిదని తెలవదా? మావయ్య పోతే, కొడుకులూ, కూతుళ్ళూ, తల్లి చెప్పినట్టే నడుస్తున్నారు. అత్తయ్య కొచ్చిన ఆస్తి, మీ నాన్నకెలా వొస్తుంది? మీ నాన్న సంపాదించేదేం వుంది? మట్టి! తాత గారి పుణ్యం వల్ల ఈ కొంపన్నా

దొరికింది గానీ, కట్నాలు పోసి ఆడపిల్లలకి పెళ్ళిళ్ళా? ఇంకా నయం!"

"చిన్నాకి కూడా పెళ్ళుండదా?"

"దానికేం ఖర్మ? మళ్ళీ అదే అడుగుతావు! అది ఉద్యోగం సంపాదించుకుంటే, దాని జీతం చూసే ఎవడన్నా చేసుకుంటాడు. దాని సంగతి ఇప్ప డెందుకులే. పెళ్ళి లేకపోతే, నువ్వు మాత్రం పుట్టింట్లో ఎన్నాళ్ళుంటావు? నూతికో, గోతికో పరిగెత్తుతావు."

"నాకేం అంత ఖర్మ లేదు. నూతులూ గోతులూ నేనెందుకు వెతుక్కోవాలి? అత్తయ్య వస్తే, నాకు కావల్సినన్ని అడుగుతాను."

"అంటే? ఆవిడి కొడుకుతో నువ్వు పెళ్ళికి ఒప్పుకోకపోయినా, నగలడిగితే ఇస్తుందా?"

"ఆ బండవాడితో కాపరం తప్పుతుందా? ఎలాగో ఏడుస్తాలే."

"తప్పమ్మా, తప్పుడు మాటలు మాట్లాడకు! వాళ్ళు వింటే బాధ పడిపోతారు సుమా!"

"ఏడిశార్లే! నా బాధ నాకు లేదా? వాళ్ళ బాధే కావాలి మీకు!"

"మావయ్యని అడగమని నాన్న చెప్పాడుగా? నువ్వడిగితే, మావయ్య ఏదన్నా చిన్న సంబంధం చూస్తాడేమో!"

"నా అంత అందగత్తెకి చిన్న సంబంధమా! దాని పెళ్ళి అది చేసుకుంటే, మన కులం వాణ్ణి చేసుకోదా?"

"అదేం మాట? మన వాణ్ణే ఎందుకు చేసుకోదూ? మన కులమే, మన మతమే. దాని గోల నీ కెందుకు గానీ, నీ పెళ్ళి సంగతి నువ్వు చూసుకో! మన దగ్గిర డబ్బేం వుంది?"

"చిన్నాకి అయితే, చిన్న సంబంధం చేస్తే చెయ్యండి! నేనలా చేసుకోను."

తల్లి అందుకుంది. "అవున్లే. చిన్నాకి చిన్న సంబంధాలు కాకపోతే, పెద్ద సంబంధాలు వస్తాయా? గాజు లేసుకోదు, దుద్దులు పెట్టుకోదు. అసలే చామన చాయ మనిషి. ఏ అంద చందాలూ లేకుండా బోడి ముండ లాగ వుంటే, వుద్యోగం మాత్రం ఎవడిస్తాడు? అందంగా కనపడితేనే పనిలో పెట్టుకుంటారు."

"అందుకే నేనసలు అవేవీ పెట్టుకోను" అనేసింది కళ్యాణి.

ఆ తగువులు అలా సాగుతూ వుండగానే కళ్యాణి, చద్దన్నం పచ్చడితో తినేసి, గబ గబా బైటికి పోయే దాకా, ఆ పంచాయితీ జరుగుతూ జరుగుతూనే వుంది.

తల్లి, వంటింటి వసారాలోకి బైల్దేరి, ముందు కోడిగుడ్డు అట్టు వేసి, నాలుగు బ్రెడ్డు ముక్కల్ని నాలుగు నేతి చుక్కలతో వేయించి, అవన్నీ పళ్ళెం నిండా పెట్టి, పెద్ద కూతురికి అప్పజెప్పింది. తర్వాత, కాస్త ఉప్పుడు పిండి వొండి, మొగుడికి అందించి, తనూ కొంత వరకూ తిని, అప్పుడు కూరల పనిలోకి దిగింది.

"ఏం కూర కావాలే?" అని బంగారిని అడగా లనుకుంది గానీ, ఆ పూట మనసు ఒప్పలేదు. రోజూ అదే అలవాటు గానీ, ఆ రోజు ఆ అలవాటు తప్పింది. కూరగాయలు కోసి పెట్టడానికైనా అది లేచి వస్తుందనుకుంది గానీ, దాని జాడే లేదు. చిన్నా వుంటే, అది పుస్తకాలు పడేసి, కత్తి పీట మీద కూర్చుంటుంది. చిన్నా అయితే, ఒక వేపున గోంగూర తుంచుతూనే తన బళ్ళో కబుర్లు చెపుతూ వుంటుంది.

"నీకు ఉద్యోగం నిజంగా వొస్తుందంటావా? అంత చదువా నీది?" అంటే,

"అమ్మో, రాకపోతే ఎలా బతుకుతాం? నాన్న పని ఎన్నాళ్ళుంటుంది? దూరంగా, వేరే రాష్ట్రాలకు పోతే, బ్యాంకుల్లో పనులు దొరుకుతాయంటున్నారు తెలుసా? రాధా, నేనూ, ఎంత దూరం అన్నా పోతాం."

"ఏమో, నాన్నకి భయంగా వుంది."

"ఫర్వాలేదమ్మా, అంత భయ పడక్కర్లేదంట. రాధ నాన్నగారు మాతో వుంటారు, ఆయనకి అన్నీ తెలుసు."

"ఏమోనమ్మా, ఏం కొంప ముంచుతావో! ఇక్కడే ఎక్కడో దగ్గిరిగా పంతులమ్మ పని చేసు కుంటే చాలదా? మనకేం మేడలు కావాలా, మిద్దెలు కావాలా?"

"బ్యాంకు పని దొరక్కపోతే, ఇదే తప్పదులే."

కాలేజీకి సెలవు రోజుల్లో అయితే, దాదాపు వంట పనంతా కళ్యాణిదే. కళ్యాణికి అది సరదా కూడా.

కొత్త కూర ఏదో ఒకటి చెయ్యాలని చూస్తుంది. అక్కకి నచ్చదని భయం గానీ, ఏది వొండినా నాన్న బాగానే తింటాడు.

వంట అయిపోతే, మళ్ళీ తన పుస్తకాలే తను ముందేసుకుంటుంది.

సరిగ్గా అప్పుడే రేడియో పట్టుకురావొచ్చు అక్క, ''ఇదుగో, ఈ కొత్త పాట చూడు! ఈ కొత్త సినిమా మన వూరు కింకా రాలేదు. రాగానే మొదటి రోజే వెళ్ళాలి మనం.''

''ఏం, రెండో రోజు వెళ్తే? ఎప్పుడు చూసినా అదేగా? మొన్న పెద్ద బావ అలాగే అన్నాడు. పెద్ద బావ అయితే, మొదటి రోజు అస్సలు వెళ్ళడంట! చిన్న బావ అయితే నీ లాగే, మొదటి రోజే చూడాలంటాడంట!''

''తమ్ముడికున్న బుద్ధే లేదు, అన్నకి. మొదటి రోజే చూస్తే, అందరి కన్నా ముందు మనమే చూసినట్టు చెప్పుకోవచ్చు, తెలుసా?''

''ఏమో, అక్కా! సరేలే.''

ఇంట్లో వుంటే, అక్కతో అవే వాదాలు కళాకి.

*　*　*

**అక్క,** వడ్డాణం పిచ్చితో మాట్లాడడం ఎప్పుడూ తెలుసు చెల్లెలికి. ''అది అంతేనేమో! ఆడ వాళ్ళకి ఆ నగ వుండాలేమో!'' అనుకుంది ఈ చెల్లెలు కూడా ఆ రోజుల్లో!

పొద్దున్న చీకట్నించే, అక్క పెళ్ళి గోల ప్రారంభ మైనప్పట్నించీ కళ్యాణిని ఒక ఆలోచన తినేస్తోంది. అక్కకి ఒక మంచి మాట చెప్పాలి. ఎప్పుడు? ఇప్పుడెలాగ? సాయంత్రం అయితే? రాత్రికైతే? ఆ రాత్రికే. అక్క కాస్త బాగా వుంటుంది, వింటుంది. దానికి నగలే ఇష్టం గానీ, బావ ఇష్టం లేదు. ఆ నగల పిచ్చే పోతే? - అదే చెప్పాలి.

రెండు నెల్ల కిందటే ఒక లెక్చరమ్మ గారు క్లాసులో, పాఠాల్లో లేని చాలా వింత విషయాలు చెప్పింది.

అప్పట్నించీ ఆ వింతల్ని అక్కకి కూడా చెప్పాలని చెల్లెలికి వుంది గానీ, ఎప్పుడూ ఆ ప్రయత్నం చెయ్యలేదు. కానీ, ఇప్పుడు తప్పకుండా చెప్పాలనిపించింది. ఇప్పుడు కాదు గానీ, రాత్రి కైతే తప్పకుండా చెప్పాలని గట్టిగా గుర్తు పెట్టుకుంది.

ఆ రాత్రి అది జరిగింది.

''అక్కా! ఆడ వాళ్ళని, మొగ వాళ్ళు, తమ కంట్రోల్లో వుంచు కోవాలని ఆడ వాళ్ళకి నగల పిచ్చి పెట్టారంట! ఆడ వాళ్ళ చేతులకి గాజులూ, కాళ్ళకి కడియాలూ, మెళ్ళల్లో కంటెలూ, అన్నీ అందుకే నంట! ఆడ వాళ్ళు ఎటన్నా పోతోంటే, ఆ నగలన్నీ చప్పుళ్ళు చేస్తాయనీ, అప్పుడు మొగ వాళ్ళకి తెలుస్తుందనీ, అంట! అదంతా కచ్చితంగా అలాగే అవునో కాదో గానీ, ఆడ వాళ్ళ నగలన్నీ తప్పులే - అని చెప్పారక్కా! ఇంకా చెపుతా ....'' అంటూ, చెల్లెలు ఆవేశంగా మొదలు పెట్టేసింది.

''ఏడిశావ్‌లే, మొగోళ్ళకి నగలుండవా? ఉంగరాలుంటాయిగా?'' అంది అక్క.

''అది కాదక్కా! అసలు విను. మా లెక్చెరరు గారు చాలా నగల గురించి చెప్పారు. అదంతా చెపుతోంటే, నేను నా చేతులికి గాజులుంటే, అవన్నీ తీసేశాను. ఆ రోజు క్లాసుకి ఉష రాలేదు. ఆ మర్నాడు దానికి అదంతా చెప్తే, దానికి రొండు వుంగరాలుంటాయి; వాటిని లాగేసింది. దుర్గ మాత్రం నేను గాజులు తీసేస్తోంటే, వాటిని తన కిచ్చెయ్యమంది. ఇవ్వకూడదని, వాటిని తర్వాత బద్దలు కొట్టేద్దామనుకున్నాను గానీ, నా చేతుల్లోంచి అదే వాటిని లాగేసుకుంది. అక్కా! నువ్వు, 'వడ్డాణం, వడ్డాణం' అంటావెందుకు? అది బరువు కదక్కా?'

''బరువైతే, నువ్వు మొయ్యొద్దులే. నీ కసలు ఎవడు చేయిస్తాడులే.''

''గాజులే తీసేశాను. వడ్డాణమా? దాన్ని ఎవరన్నా వూరికే ఇచ్చినా ముట్టుకోను.''

''నాకైతే, అన్నిటి కన్నా వడ్డాణమే ఇష్టం! అది లేకపోతే, ఆడదానికేం అందం వుంటుంది?''

''అక్కా! నీకు ఇప్పుడు వడ్డాణం లేకపోయినా, ఇప్పుడు కూడా నిన్ను అందరూ అందంగా వుంటావనే అంటారుగా?''

''అవునూ, వడ్డాణం కూడా వుంటే, 'అందం' ఇంకా పెరుగుతుందా, లేదా?''

ఆ రోజు ఎప్పుడూ లేనంత శాంతం గానే అక్క చెల్లెళ్ళ మధ్య వాదాలు జరిగి, చివరికి కళ్యాణి

నోరే మూత బడిపోయింది.

*   *   *

**ఒక** ఇంట్లో ఒక పిల్ల, ఆడో-మొగో, పుట్టి, పెరుగుతోందనుకుందాం. ఆ పిల్ల పుట్టి యేడాదే అయితే, ఆ పిల్ల నడతని పరీక్షించలేం. ఏడాది పిల్లకి ఏం నడత వుంటుందీ? రెండేళ్ళో, మూడేళ్ళో అయితే, మూడేళ్ళ పిల్ల నడత ఎలా వుందో; ఆ పిల్ల తల్లీ-తండ్రీ ఎలాంటి పెంపకందారులో, తప్పకుండా తెలిసిపోతుంది!

ప్రతీ పిల్లకీ, పసితనం నించే ఏదో ఒక **'చరిత్ర'** ఉంటుంది.

లావణ్యకీ, కళ్యాణికీ, తల్లిదండ్రులు ఒకరే. అయినా లావణ్య చరిత్రకీ, కళ్యాణి చరిత్రకీ, చెప్పుకోవలిసినంత తేడా వుంది!

లావణ్యకి, పుట్టీ పుట్టగానే ఆ పేరు లేదు గానీ, పుట్టినప్పుడు అది చిట్టీ, బుజ్జీ! తెల్లటి బొమ్మ! తండ్రి తెలుపైనా, తల్లి నలుపే. తల్లి కడుపులో తెల్లటి బొమ్మ ఎలా తయారైందో, తల్లికే ఆశ్చర్యం! తండ్రికి, అర్థంగాని ఆనందం!

ఆ తెల్లటి బొమ్మకి యాడాది నిండి రెండో యేడు సాగుతోంటే, అది ఉత్త బొమ్మ కాదనీ; అది రంభో, మేనకో, శకుంతలో, ఏదో 'చిట్టి అప్సరస' అనీ; అందరికీ వింతే!

అందరికీ నచ్చే 'అందం', తెల్లటి బొమ్మకి రెండో యేటిలోనే బైట పడింది. 'చేపల్లాంటి కళ్ళు' అన్నారు. శిఖరం లాంటి 'కోటేరు ముక్కు' అన్నారు. గవ్వల్లాంటి చెవులు - అట! తాంబూలం నమిలి నంత ఎరుపు, పెదాల మీద! జుట్టుని చెప్పక్కర్లేదు. ఎక్కడికక్కడ నొక్కులూ, వొంకులూ! 'గిరజాలు, గిరజాలు' అన్నారు చూసిన వాళ్ళందరూ.

రెండో యేటి దాకా అది చిట్టీ, బుజ్జీ, బంగారీయే. కానీ, మేనమామ ఆ రెండో యేట మళ్ళీ మళ్ళీ చూసి, "దీనికి, 'తగిన పేరు పెట్టాలర్రా! నేను ఆలోచించాలెండి. లావణ్యంతో నిండింది దీని వొళ్ళు! దీన్ని 'లావణ్య' అందాం. లావణ్య అంటే, 'చక్కని అందగత్తె' అని అర్థం వస్తుంది. దీనికి 'లావణ్య' పేరు సరిగ్గా సరిపోతుంది" అని తేల్చేశాడు.

ఆ మేనమామ మాటకి ఈ చెల్లెలి గారింట్లో, తిరుగు వుండదు. అతడు, బియ్యం వ్యాపారి. చిన్న వడ్ల మిల్లు యజమాని. 'ధనం'లో పీకల దాకా మునిగిపోయి లేడు గానీ, ధనంలో పాదాల దాకా అయితే మునిగే వున్నాడు.

రెండేళ్ళ లావణ్యకి, 'పెద్ద అందగత్తె'గా పేరు వచ్చేసింది! పిల్లని చూస్తే, ముచ్చటగా ఉంటుంది. ఆ రంగే అందరికీ ఎక్కువగా నచ్చుతుంది.

మేనత్త, ఆ నాటి నించీ ఒకటే పాట! "ఇది, నా పెద్ద కోడలే, నా పెద్ద కోడలే ఇది!" అంటూ. అప్పుడు, ఆవిడ పెద్ద కొడుక్కి పన్నెండో యేడు నడుస్తోంది.

"నేనిక చిన్న కోడల్ని వెతుక్కోవాలమ్మా!" అంటూనే వుంది ఆవిడ, ఆ నాటి నించీ.

తల్లిదండ్రుల చేతుల్లో లావణ్య, 'రాకుమారి' అయిపోయింది!

ఆ రాజకుమారి తండ్రి, అక్కగారి మాటలకి నవ్వేవాడు. "ఇప్పుడు వున్న నీ మాటలు రేపు వుంటాయా? ఎవళ్ళెవళ్ళో కట్నాలు గుమ్మరిస్తామని వస్తారు నీ దగ్గిరికి. నీ పిల్లాడు, డాక్టరో ఏదో అవుతాడు. అప్పుడు నీకు మేము కనపడతామా?" అని అక్కగారి ముందే నవ్వేవాడు.

ఆ అక్కగారు, "అలాగంటావా? సరే, నువ్వే చూడు! నువ్వే తప్పించుకుంటావేమో! నీ అందగత్తె కూతుర్ని ఏ జమీందారుకో నాలుగో పెళ్ళంగా ఇస్తావేమో! నా కొడుకే నీకు పనికిరాకుండా పోతాడేమో! చూద్దాంలే, ఎవరెలా మారతారో!" అనేసి ఆవిడ లేచిపోయి నవ్వుతూ వెళ్ళేది.

అందగత్తె తల్లి అయితే, "మా చిట్టి తల్లికి ఇప్పుడే పెళ్ళి సంబంధం కుదిరిపోయిందమ్మా!" అంటూ ఇరుగు పొరుగుల్తో నవ్వుతూ చెప్పుకునేది.

*   *   *

**ఆ అందగత్తె** తల్లిదండ్రులు, "ఇక పిల్లలే వొద్దు!" అనుకున్నారు. "మనకేం వుంది, తాతల్నాటి ఈ పాత కొంప తప్ప? ఈ సారి మొగ పిల్లాడు పుడితే వాణ్ణెలా చదివిస్తాం? ఆడ పిల్లయితే, దానికెలా పెళ్ళి చేస్తాం? ఈ రోజుల్లో ఒక్క బిడ్డతోనే అందరూ సరిపెట్టేసుకుంటున్నారు. చేతుల్లో చిల్లి గవ్వ లేని వాళ్ళకి, నలుగురైదుగురు సంతానమా? మనకి రెండో

బిడ్డయినా వొద్దు" అంటూ చెప్పుకునేవారు.

ఆ భార్యాభర్తలు అంతంత ముచ్చట్లు చెప్పుకునే రోజుల్లోనే, ఆ భార్య గర్భంలో కొత్త శిశువు నిద్ర పోతోందని ఆ భార్యకి అర్ధమే కాలేదు. 'నెలసరి' ఆగిపోయిందని ఆవిడ మూడోనెల్లోగానీ గ్రహించుకోలేదు. గ్రహించాక కూడా అది ఎందుకో అలా జరిగి వుంటుందని, అదో నిబ్బరం! "నాకు ఎప్పుడూ అంతేలే" అని భర్తగారితో సిగ్గుపడుతూ చెప్పింది. ఐదో నెలలో అసలు రహస్యం తెలిసింది. అప్పుడుగానీ, ఆ మాట భర్త చెవిలో వెయ్యలేక పోయింది.

ఆ భర్త, ఆ మాట విని ఒకటే కంగారు పడ్డాడు. వెంటనే బావమరిదికి కబురుపెట్టాడు.

ఆ పెద్ద మనిషి, అంతా విని, "దానికేముందిలే. ఈ రోజుల్లో ఎబార్షన్లు తెగ చేసేస్తున్నారు" అన్నాడు. కానీ, మళ్ళీ తేరుకున్నాడు. "పోనీ, ఈ ఒక్క సారికీ వుండనిస్తే, ఆడో, మొగో, ఎవరు పుట్టినా, అక్కా చెల్లెలో, అక్కా తమ్ముడో, వుంటారు. ఒకళ్ళకొకళ్ళు, వాళ్ళే సాయం కదా? పెద్ద వాళ్ళం మనం, వాళ్ళతో పాటు వుంటామా? అందరం పోతాం" అంటూ తన ఎబార్షన్ సలహాకి తనే ఎదురుతిరిగాడు. ఈ వ్యాపారి, ఒక్కో సారి మంచి మాటలు కూడా మాట్లాడతాడు ఆశ్చర్యంగా.

అయినా, అందగత్తె తల్లికి అది నచ్చలేదు. అన్నతో మాట్లాడడానికి సిగ్గుపడి, తన ఆలోచన తన ఆడబిడ్డకి చెప్పుకుంది.

ఆ ఆడబిడ్డకి అప్పటికే నలుగురు పిల్లలు. భర్త పోయాడు గానీ, లేకపోతే పిల్లల లెక్క పెరిగేదే. ఆవిడ, "అయ్యో, అయ్యో!" అంటూ నెత్తీ నోరూ బాదుకుంది. "దేవుడిస్తేనే పిల్లలు పుడతారు. వాళ్ళు పుట్టకపోతే మన తప్పు కాదుగానీ, పుడితే, మన తప్పా? కడుపులో పెరిగే వాళ్ళని చంపుకుంటామా? అవ్వ! ఎంత పాపం! అంత భయమా మీకు? పోనీ, ఆ పిల్లని నా కిచ్చెయ్యి! నా దగ్గిర పెంచుకుంటాను. నేనే చదివిస్తాను, నేనే పెళ్ళి చేస్తాను. మీకు భయాలెందుకు?" అంటూ వరసగా వారం రోజులు చెప్పుకొచ్చింది, సతాయించింది.

ఆ లోగా, ఆవిడికి తెలియకుండానే, ఈ గర్భవతి, ఏదో సాకుతో, డాక్టరమ్మ దగ్గిరికి పోతే, ఆ డాక్టరమ్మ, "ఇప్పుడు కుదరదు. ఐదో నెల కూడా దాటిపోయింది. పెద్ద బిడ్డకి ఐదేళ్ళు నిండకపోతే, రెండోబిడ్డ లేకుండా చేసుకోకూడదు. అయినా ఇప్పుడు ఎబార్షన్ కుదరదు" అంటూ నిబంధనలు చెప్పింది. అలాంటి డాక్టరమ్మ, ఈ రోజుల్లో లేదేమో గానీ, ఆ రోజుల్లో నిజంగా వుంది. దానికి సాక్ష్యం, ఆ తల్లి కడుపులో శిశువే!

గర్భవతి కళ్ళ నీళ్ళతోనే ఇంటికొచ్చింది. ఇంకా ఏమైనా ఉపాయాలున్నాయేమోనని వాళ్ళతో, వీళ్ళతో, రహస్యంగానే వాకబులు చేసిందిగానీ, ఏ ఆశా కనపడలేదు.

"సరేలే, పోనియ్యి, ఈ ఒక్కసారితో" అని భర్తగారు కూడా ఓదార్చడంతో, ఆ సమస్య అప్పటికి తీరింది.

* * *

**"వొద్దు, వొద్దు"** అనుకుంటూ వుంటే, రెండో పిల్ల పుట్టేసింది. అయితే, తల్లి భయపడ్డంతా అయింది. ఈ పిల్ల, 'తెల్ల పిల్ల' కాదు. తల్లి పోలికే. నలుపు కాదు గానీ, నలుపులో లెక్కే. "చామన ఛాయ" అన్నారు అందరూ. అయినా, 'అది నల్ల రంగే' అని కూడా అన్నారు. "బంగారీతో పోలిస్తే, దీని అంద చందాలే వేరు!" అన్నారు. రెండో పిల్ల పుట్టి వారం కూడా దాటక ముందే దాని అంద చందాల లెక్కలేశారు!

ఆ వారం రోజులకే ఇరుగు పొరుగు ఆడ వాళ్ళందరూ కలిసి, "అబ్బే, అదెక్కడా, ఇదెక్కడా? దాని కాలి గోటికి కూడా ఇది పనికిరాదు. అది తెల్లక్కా, ఇది నల్లక్కా!" అనెయ్యడమే! నల్లక్క అమ్మ, వదిన గారి ముందు కళ్ళ నీళ్ళు కారుస్తూ, "ఇదేంటి వొదినా? పెద్దది అలా పుడితే, ఇది ఇలా పుట్టింది" అంటూ కళ్ళు తుడుచుకునేది.

ఆ వదిన గారికి, ఈ మరదలు గారి ఏడుపు చూసి ఒళ్ళు మండి పోయేది! "నీకేం పిచ్చా? పిల్ల, పండులా వుంటే నీకు ఏడుపా? నువ్వు నల్లగా లేవూ? కాకి పిల్ల కాకికి ముద్దు అంటారు. నీ పిల్ల నీకు ముద్దు కాదూ? అయితే నా కిచ్చెయ్యి! నేనే పెంచుకుంటాను" అంటూ చివాట్లు పెట్టేది.

ఇరుగు పొరుగు చమత్కారీ అందగత్తెలు... "వొదినా! నీ పెద్ద కూతుర్ని ఎవ్వడైనా ఎగరేసి చేసుకుంటాడు గానీ, ఈ నల్లక్కని ఎవడూ కట్టుకోడు. పిల్ల ల్లేని పేద వాళ్ళ కెవరికైనా ఇచ్చేశావంటే, వాళ్ళు బాగానే పెంచుకుంటారు" అంటూ సరసాలాటలు సాగించారు. ఈ సుందరాంగుల్లో సగం మంది నల్లక్కలే. అది వాళ్ళకీ తెలుసు.

పిల్ల తల్లి, ఈవిడి పేరు చెప్పుకోనేలేదు కదా? నాగమ్మే! ఈ నాగమ్మ, కళ్ళ నీళ్ళతో, "మా కన్నా పేద వాళ్ళెవరున్నారమ్మా? ఎవరికో ఎందుకూ, మా ఆడబిడ్డకిస్తే, కళ్ళకద్దుకుని పెంచుకుంటుంది" అంటూ అందరికీ జవాబులు చెప్పింది.

ఒక నెల్లాళ్ళు నడిచేటప్పటికి, కన్న తల్లికి, నల్ల పిల్ల మీద కూడా మమకారం వంటి దేదో కాస్త పుట్టుకొచ్చినట్టే అయింది. "నేనేమన్నా తెల్లటి తెలుపా? అయినా, నా మొగుడేవన్నా నన్ను దూరం చేశాడా? అలాగే, దీనికి ఎంత మంచి వాడు దొరుకుతాడో!" అనడం మొదలుపెట్టింది.

"అవున్లే; నల్లక్క అదృష్టం ఎలా వుందో మనకేం తెలుస్తుంది?" అని, ఆ నల్లక్కకే వంత పాడారు.

తండ్రి అయితే, "పుట్టిన పిచ్చిముండ మీద అన్ని మాటలెందుకు? దాని దారిన అదే బతుకుతుంది. మనం వున్నా లేకపోయినా, దీన్ని తోడబుట్టిందే చూసుకుంటుంది. అవును, ఇద్దరన్నా వుంటేనే, ఒకళ్ళ కొకళ్ళు వుంటారు" అని చెప్పుకుంటూ సేదదీరాడు. "తోబుట్టువులు, తోబుట్టువులు" అని చాలా సార్లు అనేవాడు!

కొత్త పిల్లకి రెండో నెల దాటుతోంటే మేనమామ వచ్చాడు, పిల్లని చూడాలని. రాగానే అడిగాడు, "పెద్ద దాని పోలికలేనా? తెలుపేనా?"

"ఏదో శాస్త్రం చెప్పినట్టు అడిగావు. ఒకళ్ళ పోలికలు ఒకళ్ళకొస్తాయా?" అంది, వచ్చిన పెద్ద మనిషితో, చెల్లెలు నాగమ్మ.

"ఏం? తెలుపు రంగు కాదా కొంపదీసి?" అన్నాడు. అతగాడు, ఒడ్ల మిల్లు యజమాని. బియ్యాన్ని వెన్నెలంత తెల్లగా ఆడించి, వాటిని 'అందం' పేరుతో, ఎక్కువ ధరతో అమ్మించే గడుసు వ్యాపారి.

పిల్లని చూడాలని వచ్చిన అన్నతో నాగమ్మ, "అది ఇప్పటి దాకా ఏడ్చి యేడ్చి నిద్రకి పడింది లే. ఇంకెప్పుడన్నా చూద్దువుగాని" అనేసింది!

అన్నగారికి అర్ధమైంది, పిల్లని చూపించడానికి చెల్లెలు సిగ్గు పడుతోందని. పెద్ద పిల్ల చేతిలో బిస్కట్ల పేకెట్ పెట్టి, "సరేలే, నాకూ పనుంది. తర్వాత వస్తాలే" అనేసి లేచిపోయాడు. "అంతేగానీ, "నిద్ర పోతే యేం? నిద్రపోయే పిల్లని చూడకూడదా?" అనలేదు! అలా పోయిన వాడు, ఆరో నెలలో గానీ, కొత్త పిల్లని చూడలేదు. చూసి, నోరు విప్పలేదు.

కొత్త పిల్లకి, 'నల్ల పిల్ల' పేరు పడిపోయింది. దీనికి వారం రోజుల్లోనే పేరు పెట్టేశారు. కళ్యాణి! అది, నాయనమ్మ పేరు. 'కళా, కళా' అనీ అంటుంది మేనత్త. ఆ పేరుతో తన తల్లిని తలుస్తుంది.

చిట్టి కళ్యాణి నల్ల రంగు దాని 'దురదృష్టం' అని అందరూ తేల్చేశారు. అందరూ అనుకుంటే అనుకుంటారు గానీ, కన్న తల్లే అలా అనుకుంటుంది, తన నల్ల రంగు తను పెట్టుకుని! తనకు మంచి మొగుడే దొరికాడు కాబట్టి, తను అదృష్టవంతురాలే. రేపు, నల్ల కూతురికీ తన కున్నంత అదృష్టం వుంటుందా - అని తల్లికి సందేహమే. అది, సందేహమే గానీ, ఆందోళన కాదు. 'ఏమో, దాని కర్మ ఎలా వుంటే అలా జరుగుతుంది. దాని పాట్లు అదే పడాలి. ఎవరేం చెయ్యగలం?' అని సరిపెట్టేసుకుంది.

ఆడ దానికి, 'మంచి మొగుడు' దొరికితే అదృష్టం! వాడెవడో గాని దొరక్కపోతే దురదృష్టం!

కళ్యాణి మీద సానుభూతి కురిపించే మనిషి, మేనత్త అయిన రత్తమ్మ ఒక్కతే. "నీ చిన్న పిల్లని, నా చిన్న కొడుక్కి చేసుకుంటాలే" అంది ఒక సారి. కానీ మళ్ళీ, "అక్క-చెల్లెళ్ళని, అన్నదమ్ములు చేసుకోకూడదంటారమ్మా! అయితే, ఒకలా చేద్దాం. దీని పెళ్ళి గురించేగా మీకు బెంగ? పెద్ద దాన్ని ఎవరో ఒకరు చేసుకుంటారు కాబట్టి, ఈ నల్ల చిట్టిముండని మా పెద్దవాడికే చేసుకుంటా" అని నవ్వింది. "అలాగైతే, వాళ్ళ వయసుల్లో పన్నెండేళ్ళు తేడా అవుతుందమ్మా మరి" అంటూ విచారించింది కూడా.

చిట్టి కళ్యాణికి 'నల్లక్క' పేరు స్థిర పడి పోయింది. "అలా అనకండి" అని తల్లి, ఎవ్వరి తోటీ అనదు. పైగా నవ్వుతుంది. కళ్యాణికి మూడో నెల జరుగుతోంటేనే దాని పెళ్ళి కబుర్లన్నీ రోజూ సాగేవి. పిల్లకి ఏడాది నిండి, దాని రంగు కాస్త తెలుపు వేపు తిరిగే నాటికి, ఆ పెళ్ళి కబుర్లు కొంచెం వెనకపడ్డాయి.

ఒక సారి మేనత్త ఇంకో మాట అంది. అదే మళ్ళీ మళ్ళీ అంది. "ఈ చిన్న ముండని, మా చిన్నోడికే చేసుకుంటా, పెద్ద వాడికి బైటి సంబంధం చూస్తాలే" అని!

అది, నాగమ్మకి నచ్చింది. చిన్న దాన్ని మేనత్త ఒప్పుకుంటే, పెద్ద దాన్ని ఎవళ్ళో ఒకళ్ళు చేసుకుంటారు. ఇద్దరి సమస్యా తీరుతుంది.

అయినా, నవ్వి, "వూరుకో వదినా! పదహారేళ్ళ నాటికి కదా?" అనేస్తుంది.

* * *

**తల్లి**, ఏడాది నిండని చిన్నపిల్లకి పాలు ఇవ్వడానికి ఒళ్ళో పడుకోబెట్టుకుంటే చాలు, మూడేళ్ళు ఇంకా నిండని పెద్ద పిల్ల, చిన్న దాన్ని కిందకి తోసేసే వీర కార్యం చేసేది.

తల్లి, పెద్ద పిల్లని కేకలెయ్యదు. నవ్వులతోనే నచ్చచెప్పాలని చూస్తుంది. "తప్పమ్మా, తప్పు! తప్పు కాదూ? నీ చెల్లే ఇది. పాలు తాగకపోతే చచ్చిపోదూ? నువ్వు తాగలేదూ పాలు?" అంటూ దానికి బోధించాలని చూస్తుంది. అది, నూట పదహారో సారి అయినా సరే! పెద్ద దానికి ఆ మెత్త మెత్తని బోధనలే అలవాటు!

ఎలాగైనా సందు చేసుకుని పెద్ద పిల్ల, చిన్న దాన్ని, ఒక్క దెబ్బన్నా వేసేస్తుంది. చిన్న దానికి, పాల మత్తులో, ఆ దెబ్బ అంటనే అంటదు. పాలు తాగుతూనే నిద్రకి పడిపోతుంది. తర్వాత గుడ్డ ఉయ్యాల్లోనే దానికి వెచ్చగా నిద్ర. అక్క గారు రెండేళ్ళపాటు వూగిన చెక్క వుయ్యాలని ఎవళ్ళో కావాలని అడగ్గానే అమ్మేశారు! ఎప్పుడూ? తల్లి కడుపులో ఈ శిశువు పెరుగుతోందని తెలియక ముందు కాదు; తెలిసిన తర్వాతే! అది ఎలాగా గర్భస్రావంతో నేల కరుస్తుందనే నమ్మకంతో! ఆ ముచ్చట జరగలేదు కాబట్టి, చిన్న దాని నిద్రకి, పాత చీర వుయ్యాలే తప్పనిసరి అయింది. ఆ పాత చీర ఒక సారెప్పుడో చప్పున చిరిగి పీలికలై, అందులో నించి చిన్నది కెవ్వున అరుస్తూ కిందకి సగం జారింది కూడా! దాన్ని, నేల ఆకర్షించ బోయింది గానీ, ఆ నేల శక్తి, చీర వుయ్యాల ముందు ఓడింది! చీర వుయ్యాల, పీలిక లైతే మాత్రం ఇక అప్పుడు చెక్క వుయ్యాలేం కొంటారూ? దీని తర్వాత ఆ చెక్క ఉయ్యాలలో ఇంకెవరు వూగుతారు?

మూడు నాలుగేళ్ళ పెద్ద పిల్ల గిరజాల జుట్టుకి, పూట పూటా రెండు జడలూ, రిబ్బన్నులూ, చెంప పిన్నులూ, జడల మీద బంతి పూలూ, అప్పు డప్పుడూ పూల జడలూ! చిన్న దానికి, ఏడాది దాకా గుండూ, ఆ తర్వాత నించీ పొట్టిగా క్రాపూ! దీని జుట్టు అరంగుళం అంత పెరిగితే చాలు, ఆ జుట్టుకి తండ్రి గారు, కత్తెర రుచి చూపించేస్తాడు.

ఈ చిన్న దానికి క్షవరం జరిగిన ప్రతీ సారీ మేనత్త అయితే, "అవ్వ! అవ్వ! ఆడ పిల్లకి క్షవరాలు చేస్తారా? నుదురు దగ్గిర చిన్న జడ అల్లి, ఊలు ముక్కతో కృష్ణుడి జడ కట్టాలి. ఈ సారి నేను అల్లుతానుండు" అని గోల పెడుతూనే వుంటుంది. ఆ పిల్లకి జడ అల్లాలని చూస్తే, జుట్టే అందదు.

పిల్లల తల్లి నవ్వుతూ, "అమ్మో, ఇద్దరు పిల్లలకీ జడలంటే, వారం వారం తలల రుద్దుళ్ళు పెద్ద పని వదినా!" అనేస్తుంది.

"ఏంటీ? ఇద్దరు పిల్లలకి తలంట్లు పెద్ద పనా? నేను నలుగురు పిల్లలకి రుద్దే దాన్ని కాదూ? నువ్వెరగవులే. అయితే, పెద్ద దానికి కూడా కత్తిరించండి. పదేళ్ళ తర్వాత ఇద్దరికీ జడలు పెంచొచ్చు" అంటుంది మేనత్త.

ఈ పిల్లల తండ్రి ఒప్పుకోడు. "పెద్ద తల్లి జుట్టు వొంకు లొంకులు. అయ్యన్నీ కత్తిరించేస్తే, అట్టాగ మళ్ళీ వస్తాయో రావో!" అంటూ కూతురి అందం అంతా పోతుందేమో అని వొణికిపోతూ అనేస్తాడు.

మేనత్త ఊరుకుంటుంది. చిన్న దాని జుట్టుకి కొత్త కత్తిరింపులు జరిగినప్పుడల్లా, అటూ ఇటూ ఆ వాదాలే సాగి సాగి, పిల్లల మేనత్త విసుగెత్తి, "చాల్లెద్దురూ, మీరు మరీనూ" అనడంతో అవి ఇక ఆగుతాయి.

* * *

**ఆ రోజుల్లో**, మేనత్త కూతుళ్ళు జయా, విజయా, ఇంకా స్కూళ్ళకి తిరుగుతోన్నవాళ్ళే. అప్పుడప్పుడూ మేనమామ ఇంటికి పరిగెత్తుకొచ్చి చిన్నాని ఎగరేసి ఎత్తుకుంటూ, కాస్సేపు మోస్తూ తిరిగి, దాన్ని వాళ్ళింటికి తీసుకుపోతూ వుంటారు. తర్వాత, తల్లో, తండ్రో వెళ్ళి తెచ్చుకుంటేనే ఆ చిన్నా, ఇంటికి చేరుతుంది, అప్పటికి అక్కడే అన్నం తినేసి!

అసలు, 'అందగత్తె'కి అన్నం ఎలా వడ్డించాలో వాళ్ళమ్మకి బాగా తెలుసు. ఉడికిన అన్నంలో గరిటి పెట్టి, మధ్యలో మెత్త మెత్తగా వున్న అన్నమే తీస్తుంది. గిన్నిలో పక్కలకు అంటుకుని గట్టిపడిన దాన్ని గానీ, గిన్నికి అడుగున ఎండిన దాన్ని గానీ, అరిచెయ్యంత గట్టి అన్నం పెళ్ళని, పళ్ళెంలో పెడితే, అందగత్తె, ఇక గంతులే! ఖయ్యి, ఖయ్యిమంటుంది; పళ్ళెం తోసేస్తుంది. ''నాకొద్దు, నా కొద్దు'' అనేసి లేచిపోతుంది.

ఆ వీరత్వం, ఏ వయసులో? నాలుగైదేళ్ళ వయసులో! మధ్యాన్నం పూట అన్నాలైతే, అన్నం తెపాళాలో మిగిలి వున్న అన్నం, తెపాళా అడుక్కీ, పక్కలకీ, అంటుకుపోయి ఎండిపోయి, చల్లారి పోయి వుండక తప్పుతుందా? ఆ అట్టలు గట్టిన అన్నాన్ని వూడదీసి, నాలుగు నీళ్ళ చుక్కలు జిమ్మి, పొయ్యి మీద వెచ్చబెట్టి, నాలుగైదేళ్ళ జ్యేష్ట కుమార్తె పళ్ళెంలో పెట్టబోతే, "ఆఁ, అదా? అదేనా?'' అని, ఆ కుమార్తె కేకలు పెట్టిందంటే, ఆ ముప్ఫైయ్యేళ్ళ కన్నతల్లికి ముచ్చటే! "ఓసీ, నీ దుంపతెగా! ఇప్పుడేం తింటావే మరీ? సరేలే, కాస్సేపు గవ్వలాటాడుకో! ఉప్మా చేసి పిలుస్తాలే. చిన్నా! ఈ అన్నం అక్కకి వొద్దంట! దానికి ఇలాంటిది నచ్చదమ్మా. చెప్తే వింటుందా, పెడుతుందా? ఈ అన్నం నువ్వే తినెయ్యమ్మా! చింతకాయ పచ్చడేసి కలుపుతాను. ఏ మాట చెప్పినా వింటావు నువ్వు. నీ దారే వేరు'' అంటూ పెద్ద కుమార్తెకు పనికిరాని ఆ గట్టి అన్నాన్ని ఆ తల్లి, చిన్న కుమార్తెకి అప్పజెప్పడంతో, ఆ పూట తగువు తేలిగ్గా ముగుస్తుంది.

అసలు తగువేంటో అర్థం కాకుండానే మూడేళ్ళ చిన్నా, పచ్చడి అన్నం నేతి చుక్కలతో కమ్మగా తినేస్తుంది.

* * *

**పిల్లల్ని పెంచే** తల్లిదండ్రులు, ఏ పిల్లకైనా, ఏది ఒప్పో, ఏది తప్పో; ఏది మంచో, ఏది చెడ్డో; ఒక్క సారైనా మందలిస్తూ చెప్పక్కర లేదా? "ఇలా ఉండు, అలా ఉండకు!'' అని బోధించక్కర లేదా? పిల్లలు, ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో; తల్లి దండ్రుల నించి గాక, గాలిలోంచి నేర్చుకుంటారా?

అసలు, ఆ తల్లిదండ్రులు మాత్రం, తమ పిల్లల కేం నేర్పాలో, ఎక్కడి నించి నేర్చుకుంటారు? వాళ్ళ వయసులు పెద్ద వయసులే. ఆ వయసులైనా దేనినీ వాళ్ళకి నేర్పవా?

"తెపాళాకి అంటుకోకుండా అన్నం ఉడుకు తుందా? గడ్డ కట్టిన అన్నాన్ని చితుపుకుని కూరతో కలుపుకుని తినలేమా? తింటే తిను, లేకపోతే లేదు, పస్తు పడుకో!'' అని తల్లి ఒక్కసారైనా, ఒకే ఒక్క సారైనా, మందలించి వుంటే, ఆ పెద్ద పిల్ల, ఆ రకంగా పేట్రేగుతూ తయారవుతుందా? అది, పిల్ల తప్పా, తల్లి తప్పా?

పిల్లల పెంపకాలకి దారీ తెన్నూ వుండదా? పెద్ద పిల్లయితే, మాట వినదా? చిన్న పిల్లే, మాట వింటుందా? అస్తమానూ పిల్లల ముందు, "అది వినదమ్మా, నువ్వే వింటావు. దానికి నచ్చదమ్మా, నీకే నచ్చుతుంది'' అంటూ, ఆ పిచ్చి మాటలు వాగడానికి, ఆ తల్లికి బుద్ధీ గ్యానం వుండవా? ఒక పక్క, పిల్లల మేనత్త సాధిస్తూనే వుంటుందే! పిల్లల్ని ఎలా చూడాలో బోధిస్తూనే వుంటుందే!

మేనత్త గారింట్లో ఎప్పుడూ, కోడి కూరలూ, రొయ్యల కూరలూ, ఇంకా ఇంకా చాలా రకాలు, దాకల కొద్దీ తయారవుతూనే వుంటాయి. మేనత్త కూతుళ్ళలో జయో, విజయో, మూతల గిన్నెలతో, వీళ్ళింట్లో నలుగురికీ రెండు పూటలా సరిపోయే టంతంత కొత్త కూరలు, పట్టుకొస్తూనే వుంటారు. అసలు, అక్కడ ఏదో తాజా కూర తయారీ జరుగుతూంటేనే, ఆ కమ్మటి కబురు, ఈ ఇంటికి అందుతూ వుంటుంది! ఇక్కడ కూర తయారీ ఆగుతుంది, ఆ పూటకైనా.

* * *

**చిన్నాకి** నడక వచ్చేసిందంటే, దాని నడక

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Kalyani+Kadha**

* * *